
సాక్షి బాపట్ల

ఆదివారం । 10 । నవంబర్ । 2024



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 8788 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా, దిగువకు 12000 క్యూసెక్కులు వదులుతున్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 587.40 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 10,120 క్యూసెక్కులు వదిలారు.

సహస్ర లింగార్చనలు



ఫిరంగిపురం: తక్కెళ్లపాడు గ్రామం లోని వీరాంజనేయ స్వామి ఆలయంలో కార్తికమాసాన్ని పురస్కరించుకొని శనివారం సహస్ర లింగార్చన పూజలు వైదిక సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

హ్యాండ్లూమ్ కో-ఆపరేటివ్ సొసైటీ చైర్‌పర్సన్‌గా హేమలత



డాక్టర్ సజ్జా హేమలత

చీరాల: చీరాల నియోజకవర్గానికి చెందిన డాక్టర్ సజ్జా హేమలత ఆంధ్రప్రదేశ్ హ్యాండ్లూమ్ కో-ఆపరేటివ్ సొసైటీ చైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు. శనివారం ప్రభుత్వం నామినేటెడ్ పదవుల జాబితాను విడుదల చేసింది. జాబితాలో ఆమెకు హ్యాండ్లూమ్ కో-ఆపరేటివ్ సొసైటీ చైర్‌పర్సన్ అవకాశం దక్కింది. 2024 ఎన్నికలలో ఆమె చీరాల నుంచి టీడీపీ టికెట్ ఆశించి నిరాశ చెందారు. అయితే పార్టీ అభ్యర్థి ఎంఎం కొండయ్య విజయానికి ఆమె కృషి చేశారు. ఆమెకు పలువురు పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు.

బుడా చైర్మన్‌గా సలగల రాజశేఖర్‌బాబు



బాపట్లటౌన్: బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (బుడా) చైర్మన్‌గా టీడీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు సలగల రాజశేఖర్‌బాబును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో సలగల తండ్రి బెంజిమెన్ వెంకయ్య నాయుడుపై గెలుపొంది బాపట్ల ఎంపీగా, ఎమ్మెల్సీగా పనిచేశారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన సలగల రాజశేఖర్‌బాబు 2013లో టీడీపీలో చేరారు. అప్పటినుంచి పార్టీలో క్రియాశీలకంగా ఉన్నారు. బాపట్ల బుడా చైర్మన్‌గా నియమితులైన రాజశేఖర్‌బాబుకు బాపట్ల జిల్లాలోని కూటమి నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఉచిత న్యాయసేవలను పొందవచ్చు

ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె నరేంద్రరెడ్డి



చిలకలూరిపేట: ఆర్థిక స్తోమత లేని వారు మండల న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయసహాయం పొందవచ్చని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె నరేంద్రరెడ్డి చెప్పారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పసుమర్రు గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో జాతీయ న్యాయసేవా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ న్యాయ సహాయం కోసం స్వయంగా మండల న్యాయసేవాధికార సంస్థను సంప్రదించటంతో పాటు, ఉత్తరం రాయడం, లేదా నల్సా హెల్ప్ లైన్ నంబర్ 15100లో సంప్రదించవచ్చన్నారు. దీంతో పాటుగా కక్షిదారులు లోక్‌అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవడం ద్వారా సత్వర న్యాయం పొందవచ్చని వెల్లడించారు. వివిధ చట్టాలపై సీనియర్ న్యాయవాదులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు పి వెంకటేశ్వరరావు, జీవీహెచ్ ఎస్ ప్రసాద్, ఎం భానుప్రసాద్, రూరల్ ఎస్‌ఐ జి అనిల్‌కుమార్, స్కూల్ హెచ్‌ఎం వై హనుమంతరావు పాల్గొన్నారు.

అమరేశ్వరునికి లక్ష బిల్వార్చన



అమరావతి: పంచారామ క్షేత్రాలలో ప్రథమారామక్షేత్రమైన అమరావతి అమరేశ్వరాలయంలో శనివారం లోక కల్యాణార్థం ప్రజలంతా సుభిక్షంగా సుఖసంతోషాలతో జీవించాలనే సంకల్పంతో దాతల సహకారంతో అమరేశ్వరునికి లక్షబిల్వార్చనను అత్యంత భక్తిశ్రద్ధలతో ఆలయ అర్చకులు, వేదపండితులు జరిపించారు. తొలుత మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని నిర్వహించి గణపతిహోమం నిర్వహించారు. స్వామివారికి విశేష అలంకరణ అనంత రం సహస్ర నామాలతో రుత్విక్కులు అమరేశ్వరునికి లక్ష బిల్వదళార్చన నిర్వహించారు. బాలచాముండికా అమ్మవారికి లక్ష కుంకుమార్చనలు చేశారు. కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం 5706 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 292 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్‌కు 1089 క్యూసెక్కులు, తూర్పు కెనాల్‌కు 540 క్యూసెక్కులు, పశ్చిమ కెనాల్‌కు 178 క్యూసెక్కులు, నిజాంపట్నం కాలువకు 398 క్యూసెక్కులు, కొమ్మమూరు కాలువకు 3040 క్యూసెక్కులు విడుదల చేశారు.

నామినేటెడ్ కుంపటి

నామినేటెడ్ పదవుల పంపిణీపై కూటమిలో తీవ్ర అసంతృప్తి

- రెండవ జాబితాలో ముగ్గురికి మాత్రమే దక్కిన వైనం
- అందులో ఒకటి జిల్లాస్థాయి చైర్మన్ మాత్రమే..
- జిల్లాలో రెండు టీడీపీ, ఒకటి జనసేనకు
- బీజేపీ నేతల ఊసు మరచిన వైనం
- పచ్చపార్టీ సీనియర్లతోపాటు మండిపడుతున్న జనసేన, బీజేపీ నేతలు
- ఐదు నెలలుగా ఎదురు చూస్తున్నా ఫలితం లేదని ఆవేదన



సాక్షి ప్రతినిధి,బాపట్ల: కూటమి ప్రభుత్వం ప్రకటించిన రెండవ జాబితాలోనూ నామినేటెడ్ పదవులు దక్కక పోవడంతో పచ్చపార్టీ సీనియర్లతో పాటు జనసే, బీజేపీకి చెందిన ఆశావహులు మండిపడుతున్నారు. దశాబ్దాలుగా పార్టీకోసం శ్రమిస్తున్నా తమకు ఏమాత్రం గౌరవం లేకుండా పోయిందని కొందరు టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తుండగా.. గత ఎన్నికల్లో కూటమి విజయంకోసం పని చేసిన తమకు ఏమాత్రం ప్రాధాన్యతనివ్వకపోవడంపై జనసేన, బీజేపీకి చెందిన పలువురు ఆశావహులు మండిపడుతున్నారు. పదవులు దక్కని నేతల అనుచరులు వారి వారి అధిష్టానాలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా టీడీపీ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు.

రెండులో మూడే..!

కూటమి ప్రభుత్వం తొలివిడత నామినేటెడ్ పోస్టుల జాబితాలో జిల్లాకు ఒక్క పదవీ దక్కలేదు. రెండవ జాబితాలో పదవులు దక్కుతాయని ఆశావహులు ఆశించారు. పదవుల కోసం ఐదు నెలలుగా ఎదురు చూపులు చూశారు. తీరా శనివారం ప్రభుత్వం నామినేటెడ్ పదవుల జాబితా విడుదల చేసింది. బాపట్ల జిల్లాకు రెండు రాష్ట్రస్థాయి చైర్మన్ పదవుల తోపాటు ఒక జిల్లా స్థాయి చైర్మన్ పదవిని కేటాయించారు. టీడీపీ కోటాలో చీరాలకు చెందిన సజ్జా హేమలతకు రాష్ట్రస్థాయి చేనేత, చేతివృత్తుల సహకారసంస్థ చైర్‌పర్సన్ పదవి కట్టబెట్టగా జనసేన కోటాలో రేపల్లెకు చెందిన చిలకపూడి పాపారావుకు అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పదవినిచ్చారు. టీడీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడిగా ఉన్న సలగల రాజశేఖరబాబుకు బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ పదవి ఇచ్చారు.

ఆశలపై నీళ్లు..

మొదటి జాబితాలో రాకపోయినా రెండవ జాబితాలో పదవులు లభిస్తాయని పచ్చపార్టీ సీనియర్లతోపాటు బీజేపీ, జనసేన నేతలు ఆశల పల్లకిలో ఊయలలూగారు. తమకూ 25 శాతం వాటాతో మరిన్ని పదవులు లభిస్తాయని జనసేన నేతలు సంబరపడగా పదిశాతం వాటాలో కొన్నైనా పదవులు లభించనున్నాయని బీజేపీ నేతలు ఆశించారు. తీరా చూస్తే జిల్లాలో ఇద్దరు టీడీపీ, ఒక జనసేన నేతకు మాత్రమే పదవులు దక్కాయి. బీజేపీ కోటాలో ఒక్క పదవీ రాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పెద్ద ఎత్తున నామినేటెడ్ పదవుల పంపకం ఉంటుందని ప్రచారం జరిగింది. పదవుల కోసం ఒక్కో నియోజకవర్గం నుంచి వంద పేర్లు పంపాలని టీడీపీ అధిష్టానం సూచించడంతో ఎమ్మెల్యేలు, ఎంపీలు, నియోజక అబ్జర్వర్లు, జిల్లా అబ్జర్వర్లు నాయకుల జాబితాలు పంపారు. కూటమిలోని జనసేన, బీజేపీ నేతలు సైతం తమ జాబితాలను అధిష్టానానికి చేర్చారు.

రాష్ట్రస్థాయి నేతలు ఉన్నా..

జిల్లా టీడీపీలో రాష్ట్రస్థాయి పదవులున్న నేతలు చాలామంది ఉన్నారు. టీడీపీ రాష్ట్రనేత తాతా జయప్రకాశ్‌నారాయణ, బాపట్ల మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధనరెడ్డి, రాష్ట్ర మహిళానేత మానం విజేత, తెలుగురైతు నేత పమిడి భాస్కర్‌రావు, వేమూరు నియోజకవర్గం నుంచి మైనేని మురళీకృష్ణతో పాటు భట్టిప్రోలు మండలానికి చెందిన సాయిబాబా, చీరాలకు చెందిన చంద్రమౌళితో పాటు పలువురు నేతలు నామినేటెడ్ పదవులు ఆశించారు. జనసేన నుంచి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మత్తి భాస్కర్‌రావు, బాపట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి శివన్నారాయణతోపాటు మరికొందరు నేతలు పదవులు ఆశించగా శివన్నారాయణకు బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ చైర్మన్ పదవి లభించనుందని సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరిగింది.

'అన్నం' అనుచరుల ఆగ్రహం

బీజేపీ కోటాలో మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణలకు సైతం పదవులు లభిస్తాయని ప్రచారం జరిగింది. అన్నం సతీష్ ప్రభాకర్‌కు కీలక పదవి కట్టబెట్టే అవకాశముందని ఆయన అభిమానులు ఆశించారు. తీరా చూస్తే రెండవ జాబితాలోనూ మూడు పార్టీల్లో సజ్జా హేమలత, సలగల రాజశేఖరబాబుకు మినహా ముఖ్యనేతలకు ఎవరికీ నామినేటెడ్ పదవి దక్కలేదు. దీంతో ఆయా పార్టీల నేతలు తీవ్ర నిరాశకు గురయ్యారు. అధిష్టానంపై ఆగ్రహంతో రగిలిపోతున్నారు. తమ నాయకులకు పదవులు దక్కక పోవడంతో వారి అనుచరులు, అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మొత్తంగా నామినేటెడ్ పదవుల పంపిణీ వ్యవహారం కూటమి పార్టీల్లో కుంపటి రగిలిస్తోంది. పోను పోనూ ఇది మరింత తీవ్రతరం అయ్యే అవకాశం కనపడుతోంది.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు వీరే..



పవని భానుచంద్రమూర్తి



జి.శేషవరలక్ష్మి



కేవీ శ్రీనివాసరావు

చీరాల అర్బన్: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు చీరాల నియోజకవర్గం నుంచి ఇద్దరు, అద్దంకి నియోజకవర్గం నుంచి ఒకరు ఎంపికయ్యారు. ఈ మేరకు శనివారం ప్రభుత్వం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల జాబితాను ప్రకటించింది. వీరిలో చీరాల పట్టణంలోని ఆంధ్రరత్న మున్సిపల్ హైస్కూల్‌లో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పవని భానుచంద్రమూర్తి, చీరాల మండలం ఈపూరుపాలెంలోని జెడ్పీ గార్ల్స్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిషు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న జి.శేషవరలక్ష్మి ఎంపికయ్యారు. పట్టణంలోని ఆంధ్రరత్న మున్సిపల్ హైస్కూల్‌లో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పవని భానుచంద్రమూర్తి 2018లో ప్రకాశం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. ప్రస్తుతం ఆయన బాపట్ల జిల్లా సైన్స్ కాంగ్రెస్ కో-ఆర్డినేటర్‌గా, నేషనల్ గ్రీన్ కోర్ జిల్లా కో-ఆర్డినేటర్ పనిచేస్తున్నారు. అలానే ఎనిమిదో తరగతి ఫిజికల్ సైన్స్ పాఠ్యపుస్తక తెలుగు అనువాదకులుగా పనిచేశారు. ఈపూరుపాలెం గార్ల్స్ ఎస్‌ఏ ఇంగ్లిష్ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న జి.శేషవరలక్ష్మి 2019 జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. అలాగే 8,9,10 పాఠ్యపుస్తక ఇంగ్లిషు అనువాదకులుగా పనిచేశారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులందుకున్న వీరిని పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

చక్రాయపాలెం హెచ్‌ఎంకు అవార్డు..

అద్దంకి రూరల్: మండలంలోని చక్రాయపాలెం గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న కోట వెంకట శ్రీనివాసరావు రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రధానోపాధ్యాయుడుగా ఎంపికయ్యారు. 2004లో జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా, పలు సంస్థలు ఆయను అవార్డులు ప్రదానం చేశాయి. మండలంలోని ఉపాధ్యాయులు ఆయనకు అభినందనలు తెలిపారు.

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ



అమ్మవారి దర్శనానికి క్యూలో వేచి ఉన్న భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): వరుస సెలవుల నేపథ్యంలో శనివారం ఇంద్రకీలాద్రికి భక్తుల రద్దీ పెరిగింది. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు కర్నాటక, ఒడిశాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. కుమ్మరి పాలెం సెంటర్, హెడ్ వాటర్ వర్క్స్, సీతమ్మ వారి పాదాలు, వీఎంసీ కార్యాలయం, కెనాల్‌రోడ్డులో భారీగా వాహనాలను నిలిపారు. ఘాట్‌రోడ్డు, మహా మండపం లిఫ్టు, మెట్ల మార్గం ద్వారా కొండపైకి చేరుకున్న భక్తులు రూ. 500, రూ.300, రూ.100, సర్వ దర్శనం క్యూలైన్ల ద్వారా అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి గంటన్నర సమయం పట్టింది. సాయంత్రం పంచహారతులు, సహస్ర దీపాలంకరణ సేవ, ఊంజల్ సేవలోనూ భక్తులు, ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు.

అధికారుల చొరవతో తీరిన సాగునీటి సమస్య



రైతుల సమక్షంలో పంటకాలువ నుంచి దిగువ పొలాలకు నీటిని వదులుతున్న అధికారులు

చీరాలటౌన్: కొన్నేళ్లుగా ఎరుకుల బాడవ పొలాలు, ఇతర రైతులకు సాగునీటి వివాదం ఉంది. దీంతో దిగువన ఉన్న పంట పొలాలకు సాగునీరు సక్రమంగా అందడం లేదని ఆ ప్రాంత రైతులు తహసీల్దార్ కుర్రా గోపీకృష్ణకు ఇచ్చిన ఫిర్యాదుపై శనివారం విచారణ చేపట్టి సమస్యను పరిష్కరించారు. వివరాల్లోకెళితే.. మండలంలోని ఈపురుపాలెం రెవెన్యూ పరిధిలోని చిట్టివాద, ఎరుకుల బాడవ, సాల్వేషన్ ఆర్మీ పొలాలు ఉన్న రైతుల్లో కొందరు దిగువ ప్రాంత రైతులకు సాగునీరు సక్రమంగా అందించకుండా కొన్నేళ్లుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. దీంతో ఆ ప్రాంత రైతులు ఇటీవల తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బాధిత రైతులు, సమస్యకు కారణమైన సంబంధిత పొలాల రైతులతో రూరల్ సీఐ పి.శేషగిరిరావు, రూరల్ ఎస్‌ఐ అంబటి చంద్రశేఖర్, ఇతర రెవెన్యూ సిబ్బంది సహకారంతో చర్చలు జరిపారు. ఎరుకుల బాడవ పొలాల రైతులు, తమ పొలాలకు దిగువున ఉన్న 249 ఎకరాల పొలాలకు సాగునీరు అందించకుండా ఇబ్బందులకు గురిచేయడం దారుణమని తెలిపారు. రైతులు అందరూ సాగునీటిని సక్రమంగా సద్వినియోగం చేసుకుని పంటలు సాగు చేసుకోవాలే కానీ ఇబ్బందులు పెట్టకూడదని వివాదాలు లేకుండా రైతులు అందరు అన్నదమ్ముల్లా కలిసి ఉండాలని పోలీసులు, తహసీల్దార్ సమక్షంలో సమస్యను తాత్కాలికంగా పరిష్కరించారు. వివిధ వివాదాలు కోర్టుల్లో ఉన్నాయని వాటికి కూడా పరిష్కారం చూపి ఎవరికీ ఇబ్బందులు లేకుండా చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కాలువ నుంచి అధికారులు రైతుల సమక్షంలో దిగువ పొలాలకు నీటిని వదిలారు. దీంతో రైతులు తహసీల్దార్, రూరల్ సీఐ, ఎస్‌ఐలకు కృతజ్ఞతలు తెలిపి హర్షం వ్యక్తం చేశారు.

బాపట్ల శాస్త్రవేత్తకు ఎం.ఎస్.స్వామినాథన్ అవార్డు



బొడ్డుపల్లి మారుతీప్రసన్న

బాపట్ల: మొక్కజొన్నపై విస్తృత పరిశోధన చేసిన బాపట్లకు చెందిన బొడ్డుపల్లి మారుతీప్రసన్నకు జాతీయస్థాయిలో ప్రతిష్టాత్మక టాస్ ఎం.ఎస్. స్వామినాథన్ అవార్డు దక్కింది. వ్యవసాయ రంగంలో విశిష్ట సేవలు అందించిన శాస్త్రవేత్తలకు ఈఅవార్డును ప్రతి ఏటా ఢిల్లీకి చెందిన ట్రస్ట్ ఫర్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ (టాస్) అందిస్తోంది. ఈ ఏడాది డిసెంబరు 20వతేదీన ఢిల్లీలో కేంద్ర మాజీమంత్రి సురేష్‌ప్రభు చేతులమీదుగా ఈఅవార్డును పొందనున్నారు. బొడ్డుపల్లి మారుతీప్రసన్న ప్రస్తుతం కెన్యాలోని నైరోబీలో అంతర్జాతీయ మొక్కజొన్న పరిశోధనా కేంద్రం విభాగాధిపతిగా పని చేస్తున్నారు. గతంలో మెక్సికోలో ఇదే పరిశోధనా కేంద్రం సంచాలకులుగా కూడా పని చేశారు. 1965 ఆగష్టు 31న బాపట్లలో జన్మించిన మారుతీప్రసన్న స్థానిక వ్యవసాయ కళాశాల్లో బీఎస్సీ, ఎమ్మెస్సీ కోర్సులు పూర్తి చేసుకున్నారు. ఢిల్లీలోని భారతీయ కృషి అనుసంధాన పరిషత్‌లో పీహెచ్‌డీ పూర్తి చేసుకున్నారు. 1991లో అదేసంస్థకు చెందిన ఐఏఆర్‌ఐలో జన్యుశాస్త్రవేత్తగా చేరి రెండు దశాబ్దాలపాటు సేవలు అందించారు. మొక్కజొన్నపై విశిష్ట పరిశోధనలు చేపట్టారు. ఉత్తమ పరిశోధనలకు పలు జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు అందుకోవటంతో బాపట్ల పుర ప్రముఖులు ఆయనకు అభినందనలు తెలిపారు.

రక్తనిధి కేంద్రానికి రూ.5లక్షల ఎంపీ నిధులు

ప్రకటించిన రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి

నరసరావుపేట: ప్రభుత్వ వైద్యశాలలో రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పూర్తయి త్వరలో ప్రారంభించబోతున్న కాంపోనెంట్ బ్లడ్‌సెంటర్‌కు రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి మరో రూ.5లక్షలు తన ఎంపీ నిధులు మంజూరుచేశారు. ఇప్పటికే ఆయన రూ.5లక్షలు ఇచ్చిన విషయం విదితమే. శనివారం బ్లడ్‌సెంటర్‌ను మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డితో కలిసి సందర్శించారు. బ్లడ్‌సెంటర్ విశేషాలు, పరికరాల గురించి ఆయనకు వివరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ బ్లడ్‌సెంటర్‌కు కావాల్సిన సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేశారు. రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ పీవీఎం శరత్ బాబు, కోశాధికారి జి.మురళికృష్ణ, మేనేజింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ రేహమతుల్ల, డాక్టర్ సృజన, కేఎంయస్‌వి శ్రీనివాసగుప్తా, బత్తుల మురళి, మాజీ కౌన్సిలర్ షేక్ మస్తాన్‌వలి, వైఎస్సార్ సీపీ నాయకులు పాలపర్తి వెంకటేశ్వరరావు, గంటినపాటి గాబ్రియేలు, మూరే రవీంద్రరెడ్డి, కారుమంచి మీరావలి పాల్గొన్నారు.

దాడులు, దౌర్జన్యాల 'కూటమి'

- కూటమి పాలనలో హత్యలు, లైంగికదాడులు నిత్యకృత్యమయ్యాయి
- వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై దాడులు హేయం
- వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున



మాట్లాడుతున్న మేరుగ నాగార్జున, పక్కన అద్దంకి ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి

అద్దంకి రూరల్: కూటమి ప్రభుత్వం దాడులు, దౌర్జన్యాలకు కేరాఫ్‌గా మారిందని, ప్రజలపై దాడులు, అఘాయిత్యాలు, అమానుషాలు పరిపాటిగా మారాయని వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున అన్నారు. శనివారం అద్దంకిలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నాగార్జున మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కడ అన్యాయ జరిగినా ఉన్నది ఉన్నట్లుగా ప్రజల దృష్టికి తీసుకెళ్లే వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తలను కూటమి ప్రభుత్వం భయభ్రాంతులకు గురిచేస్తుందన్నారు. పోలీసులు స్పందించి న్యాయపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సోషల్ మీడియా సైనికులపై జరుగుతున్న దాడులు ,అక్రమ అరెస్టులపై న్యాయపరంగా వ్యవహరించాలని కోరుతూ ప్రతి జిల్లా కేంద్రంలో ఆయా నియోజకవర్గ సమన్వయకర్తలతో కలిసి ఎస్పీలకు వినతిపత్రం అందించనున్నట్లు చెప్పారు.

చేతగానప్పుడు హామీలు ఎందుకు?

అమలు చేయడం చేతగానప్పుడు బూటకపు సూపర్ సిక్స్ హామీలు ఇవ్వడం ఎందుకని మేరుగ నాగార్జున చంద్రబాబును ప్రశ్నించారు. జగనన్న పాలనలో విద్య, వైద్య రంగాలు ఎంతో అభివృద్ధి సాధించాయన్నారు. కూటమి పాలనలో అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెనల అమలు లేక విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ప్రతి పేదవాడికి మేలు జరిగేలా జగనన్న ఆరోగ్య శ్రీలో 3500 రోగాలను చేర్చి బలోపేతం చేస్తే.. చంద్రబాబు ఆరోగ్యశ్రీని అటకెక్కించారన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా దిగజారాయని, దానికి డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్యలే నిదర్శనమన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యంతో నేడు నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, పేదవాడు బతికే పరిస్థితి లేదన్నారు. మళ్లీ రాష్ట్రానికి జగన్‌మోహన్‌రెడ్డి అవసరం ఉందన్నారు. వైఎస్సార్ సీపీ అద్దంకి ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జ్యోతి హనుమంతరావు, సర్పంచ్‌లు, కౌన్సిలర్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెడ్ బుక్ రాజ్యాంగంతో పేదల బతుకు దుర్లభం



శ్రీను కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మేరుగ నాగార్జున, చిన హనిమిరెడ్డి, కనకారావు

బల్లికురవ: రాష్ట్రంలో చంద్రబాబు ఆయన కుమారుడు లోకేష్‌లు అమలు చేస్తున్న రెడ్‌బుక్ రాజ్యాంగంతో పేదలైన ఎస్సీ ఎస్టీ, బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కొమ్మూరి కనకరావు మాదిగ ఆవేదన వ్యక్తం చేశారు. బల్లికురవ మండలం చినజమ్ములమడక గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యదర్శి, దళిత రైతు చింతల శ్రీను ఇటీవల ఆత్మహత్య చేసుకోగా శనివారం బాధిత కుటుంబాన్ని వారు పరామర్శించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ సర్వే నంబర్ 756లో శ్రీనుకు సుమారు 20 ఎకరాల భూమి ఉందని సక్రమంగా పంటలు పండకపోవటంతో గత ఏడాది కూలీ పనులకు వెళ్లగా టీడీపీ నేతలు మన్నెపల్లి వెంకటేశ్వర్లు, మరికొందరు ఆక్రమించుకున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. విషయం తెలుసుకున్న బాధితుడు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు లేవన్నారు. మనస్తాపంతోనే అద్దంకిలో పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడని ఈ విషయాన్ని అద్దంకి వైఎస్సార్ సీపీ ఇచ్చార్జి పానెం చిన హనిమిరెడ్డికి ఫోన్‌ద్వారా సమాచారం ఇచ్చినట్లు చెప్పారు. హనిమిరెడ్డి ధైర్యం చెప్పి డయల్ 100 కు ఫోన్ చేసినా పోలీసులు స్పందించలేదన్నారు. ఈ ఘటన జరిగి 20 రోజులు అవుతున్నా ప్రభుత్వం, స్థానిక మంత్రి గొట్టిపాటి రవికుమార్, రెవెన్యూ అధికారులు ఆ కుటుంబాన్ని పరామర్శించకపోవటం సిగ్గుచేటన్నారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు తాము వచ్చామని, శ్రీను కుటుంబానికి అండగా ఉంటామని ప్రకటించారు. శ్రీను ఆత్మహత్యకు కారకులైన నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జ్యోతి హనుమంతరావు, యూత్ అధ్యక్షుడు కల్లి అంజనీ ప్రసాద్‌రెడ్డి, స్థానిక నేతలు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి శ్రీపుష్పయాగం

నగరంపాలెం: స్థానిక ఆర్ అగ్రహారం శ్రీ వెంకటేశ్వరస్వామివారి దేవస్థానంలో శనివారం శ్రీ పుష్పయాగ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. కార్తిక మాసం, శ్రవణా నక్షత్రం స్వామివారికి పంచామృతాలతో అభిషేకం, అలంకార పూజ అర్చన కార్యక్రమాలను వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవెంకటేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవం అత్యంత రమణీయంగా చేపట్టారు. 21 రకాల పుష్పాలతో పుష్పయాగ మహోత్సవం భక్తి ప్రపత్తులతో నిర్వహించగా, భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమాలను ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు కన్నా లక్ష్మీనారాయణ పర్యవేక్షించారు.

అల కార్తిక దీపం!



సముద్రపు అలలపై కార్తిక దీపం వెలిగించినట్లు.. ఉషోదయపు భానుడు కనువిందు చేశాడు. సూర్యలంక తీరంలో శనివారం వేకువజామున కనిపించిన ఈ దృశ్యం కార్తిక స్నానాలకు తీరానికి వచ్చిన సందర్శకుల మనసు దోచుకుంది. - సాక్షి ప్రతినిధి, బాపట్ల

ప్రభాకరరావు విగ్రహం ఏర్పాటులో రాజకీయం వద్దు

- నిర్మాణ పనులు అడ్డుకోవటం సరికాదు
- మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి



మాట్లాడుతున్న కోన రఘుపతి

బాపట్ల: బాపట్ల ప్రాంతాన్ని అభివృద్ధి చేసిన మాజీ గవర్నర్ కోన ప్రభాకరరావు విగ్రహం ఏర్పాటు విషయంలో రాజకీయాలు మానుకోవాలని మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి పేర్కొన్నారు. శనివారం స్థానిక కోన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నిబంధనల ప్రకారం విగ్రహాలు ఏర్పాటు చేస్తామని కొంతమంది మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. 2007లో బాపట్ల జీబీసీ రోడ్డును జాతీయ రహదారిగా గుర్తించారని, ఆ రోడ్డులో ఉన్న విగ్రహాలు అంతకుముందు ఆర్‌అండ్‌బీ పరిధిలో ఉన్నప్పుడు ఏర్పాటైనవే అని గుర్తు చేశారు. రోడ్డు విస్తరణ సందర్భంగా తొలగించిన విగ్రహాలను మళ్లీ ఏర్పాటు చేసేందుకు కౌన్సిల్ తీర్మానం కూడా ఉందన్నారు. స్థానిక చీలురోడ్డు సెంటర్‌ను కేపీఆర్ సర్కిల్‌గా మార్చేందుకు తీర్మానం ఉందని గుర్తు చేశారు. కేపీఆర్ సర్కిల్ ఏర్పాటు చేసి కోన విగ్రహం పెట్టకుంటే.. పాత బస్టాండ్‌లోనే గతంలో ఉన్న చోటే ఏర్పాటు చేయాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి దృష్టికి ఈ విషయం తీసుకెళ్లగా.. వివాదం లేకపోతే ఏర్పాటు చేసుకోవాల్సిందిగా సూచించినట్లు తెలిపారు. విగ్రహం గతంలో ఉన్న స్థానంలోనే పెట్టేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి, ఎస్పీ తుషార్‌డూడీ దృష్టికి తీసుకెళ్లామన్నారు. అధికారులు వెంటనే విగ్రహం ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలని, లేకుంటే న్యాయపరంగా పోరాడతామన్నారు. పనులు అడ్డుకోవటం సరికాదన్నారు. వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షులు చల్లా రామయ్య పనులు నిలుపుదలను ప్రశ్నిస్తే అక్కడున్న చింతా కిషోర్, దగ్గుమల్లి కిరణ్‌కుమార్‌పై టీడీపీ నేతలు దౌర్జన్యానికి దిగారని దుయ్యబట్టారు. రామయ్యపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయాలని కోరారు. కోన ప్రభాకరరావు విగ్రహం ఏర్పాటు ప్రజలు హక్కుగా భావిస్తున్నారని రఘుపతి తెలిపారు. రోడ్డు విస్తరణ సందర్భంగా తొలగించిన విగ్రహాలను ప్రభుత్వమే ఏర్పాటు చేయాల్సి ఉండగా... కనీసం పట్టించుకోకపోవటం విచారకరమన్నారు. అక్టోబరు నెలలో కోన ప్రభాకరరావు వర్ధంతిలోపు విగ్రహం ఏర్పాటు చేయాలని అభిమానులు కోరినప్పటికీ ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురు చూశామని కోన చెప్పారు. బాపట్లను విద్యా కేంద్రంగా తీర్చిదిద్దడంతోపాటు నియోజకవర్గంలో సాగు, తాగునీటి సౌకర్యం కల్పించిన ఘనత కోన ప్రభాకరరావుదని తెలిపారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, కోకి రాఘవరెడ్డి, నాయకులు జోగి రాజా, వడ్డిముక్కల డేవిడ్, తన్నీరు అంకమ్మరావు, అడే చందు, చింతల రాజశేఖర్, ఆట్ల నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చల్లారామయ్యపై దాడి హేయం



బాపట్ల: వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షులు చల్లా రామయ్యపై తెలుగు దేశం పార్టీ నాయకులు దాడి చేయటం హేయమైన చర్యగా ఆ పార్టీ రాష్ట్ర దివ్యాంగుల విభాగం అధ్యక్షులు కిరణ్‌రాజ్ బండెల పేర్కొన్నారు. బాపట్ల ఏరియా వైద్యశాల్లో చికిత్స పొందుతున్న చల్లా రామయ్యను శనివారం ఆయన పరామర్శించారు. బాపట్ల ప్రాంతాభివృద్ధికి కృషి చేసిన కోన ప్రభాకరరావు విగ్రహం ఏర్పాటును అడ్డుకోవటం సరికాదని అధికారులతో మాట్లాడుతుంటే టీడీపీ నాయకులు వచ్చి దాడి చేయటం సిగ్గుచేటన్నారు. చట్ట ప్రకారం దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రజలు స్వేచ్ఛగా మాట్లాడే హక్కు కూడా కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు జోగిరాజా, అడే చందు తదితరులు ఆయన వెంట ఉన్నారు.

బెల్ట్ షాపులపై దాడులు

– ఇద్దరు వ్యక్తులు అరెస్ట్



బాపట్ల టౌన్: బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ పి. గీతిక తెలిపారు. మండలంలోని ముత్తాయపాలెం గ్రామంలో డిఫెన్స్ మద్యం విక్రయిస్తున్న ప్రేమ్‌కుమార్, సాయికుమార్‌లను శుక్రవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి డిఫెన్స్ మద్యం 9 బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. వీఆర్వో సమక్షంలో బాటిల్స్ సీజ్ చేసి, వారిపై కేసు నమోదు చేశామన్నారు. ఇరువురిని శనివారం కోర్టులో హాజరుపరిచారు. దాడులు నిర్వహించిన వారిలో ఎక్సైజ్ ఎస్ఐలు డి. ప్రభుదాస్, ఎస్.మౌనిక, సిబ్బంది పాల్గొన్నారు.

కక్ష సాధింపులు మానుకోవాలి

మాజీ మంత్రి మేరుగ నాగార్జున


మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు మేరుగ నాగార్జున

బాపట్ల : సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారిపై కక్షసాధింపులు మానుకోవాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు మేరుగ నాగార్జున పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ తుషార్ డూడీని శనివారం కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో అక్రమ అరెస్టులకు వ్యతిరేకంగా వినతి పత్రం అందించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.... రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతోందన్నారు. ఎక్కడైనా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టు కనిపిస్తే వెంటనే వారిపై అడ్డగోలుగా చర్యలు తీసుకోవటం విచారకరమన్నారు. అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండించారు. అమాయకులకు అండగా పార్టీ ఉంటుందని తెలిపారు. ఎస్పీకి వినతి పత్రం ఇచ్చిన వారిలో మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి, అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి పాణెం చిన్న హనిమిరెడ్డి, పార్టీ నాయకులు వడ్డిముక్కల డేవిడ్, కోకి రాఘవరెడ్డి, కాగిత సుధీర్‌బాబు, జోగి రాజా, తన్నీరు అంకమ్మ, చింతల రాజశేఖర్ ఉన్నారు.

మత్తు మందు ఇచ్చి బంగారు నగలు చోరీ

- చెన్నై నుంచి చీరాల వస్తుండగా పినాకిని ఎక్స్‌ప్రెస్‌లో ఘటన
- సుమారు పది సవర్ల బంగారం కాజేత?


వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధిత మహిళ

చీరాల అర్బన్: రైలులో ప్రయాణిస్తున్న మహిళతో పక్కన కూర్చొన్న మరో మహిళ మాటామాటా కలిపింది. పరిచయం పెంచుకుని కొన్ని గంటల తర్వాత ముందస్తు ప్రణాళికలో భాగంగా మత్తు మందు కలిపిన జ్యూస్‌ను ఆమెకు ఇచ్చింది. స్పృహ కోల్పోయిన తర్వాత బ్యాగులో ఉన్న నగదు, ఒంటిపై ఉన్న బంగారు నగలతో ఉడాయించింది. స్పృహ కోల్పోయిన ఆమెను చీరాల రైల్వేస్టేషన్‌లో దించి చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. అర్ధరాత్రి స్పృహలోకి రావడంతో అసలు విషయం బయటపడింది.

వివరాల్లోకి వెళ్తే..

చెన్నైలో స్థిరపడిన తాడి అనూరాధ పర్చూరులోని సోదరి ఇంటికి వెళ్లేందుకు శుక్రవారం పినాకిని ఎక్స్‌ప్రెస్‌లో చీరాలకు బయలుదేరింది. జనరల్ బోగీలో ప్రయాణిస్తున్న ఆమెకు ఓ మహిళ తోటి ప్రయాణికురాలిగా పరిచయం చేసుకుని పక్కన కూర్చొంది. మాటామాటా కలిపి పరిచయం పెంచుకుంది. రైలు నెల్లూరు వచ్చేసరికి అప్పటికే ఓ ప్రణాళిక ప్రకారం ముందుగా సిద్ధం చేసిన మత్తు మందు కలిపిన జ్యూస్‌ను ఆమెకు ఇచ్చింది. దీంతో ఆమె స్పృహ కోల్పోయింది. ఇదే అదనుగా ఆమె ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలు, బ్యాగులోని నగదుతో ఉడాయించింది. రైలులో సదరు మహిళ స్పృహ కోల్పోవడంతో తోటి ప్రయాణికులు పోలీసులకు సమాచారం అందించారు. రాత్రి రైలు చీరాలకు చేరుకోవడంతో ముందుగా సమాచారం అందుకున్న జీఆర్పీ పోలీసులు 108 ద్వారా ఆమెను చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. రాత్రి 11 గంటల సమయంలో ఆమెకు స్పృహలోకి రావడంతో అసలు విషయం తెలిసింది. తన పక్కన కూర్చొన్న మహిళ మత్తు మందు కలిపిన జ్యూస్ ఇచ్చిందని, తన బంగారు నగలు చోరీకి గురయ్యాయని తెలిపింది. జీఆర్పీ ఎస్సై కొండయ్య బాధిత మహిళలతో మాట్లాడి వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

పీఆర్ డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ కార్యవర్గం

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ ఇంజినీర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఏఎస్ రాంబాబు, కె. రమేష్ ఎన్నికయ్యారు. శనివారం జెడ్పీ ప్రాంగణంలోని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ సమావేశపు హాల్లో గుంటూరు జిల్లా ఏపీ పీఆర్ డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ ఎన్నికలను నిర్వహించారు. అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షునిగా షేక్ ఫిరోజ్ లాల్, కార్యనిర్వాహక కార్యదర్శిగా జి.జయశ్రీ, ఆర్థిక కార్యదర్శిగా బీహెచ్ సాంబశివరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల ప్రక్రియలో అసోసియేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ఎస్ ప్రసాద్, డీఈఈ ఎన్నికల అధికారిగా, పల్నాడు జిల్లా అధ్యక్షులు పి.విభీషణ్ ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. నూతనంగా ఎన్నికైన జిల్లా కమిటీ సభ్యులను పలువురు ఉద్యోగులు అభినందించారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా అధ్యక్షులు ఆర్.మోహన్‌రావు పాల్గొన్నారు.

సౌరశక్తితో రాష్ట్రాభివృద్ధి సాధ్యం



చుండూరు(వేమూరు): సౌరశక్తిని సద్వినియోగం చేసుకుంటే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని గుంటూరు, పల్నాడు జిల్లాల నోడల్ అధికారి నూతలపాటి సింగయ్య అన్నారు. వేమూరు నియోజకవర్గంలోని చుండూరు మండలంలో ఉన్న యడ్లపల్లి గ్రామంలో విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజినీరు దోనేపూడి అర్జునరావు ఆధ్వర్యంలో శనివారం పీఎం సూర్య ఘర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సింగయ్య మాట్లాడుతూ సౌర విద్యుత్తు పథకాలు, ఇచ్చే రాయితీల గురించి తెలియజేశారు. ప్రజలు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. చుండూరు సెక్షన్ సిబ్బందికి లక్ష్యాలను నిర్దేశించారు. గ్రామంలో నెలకు 250 యూనిట్లు కంటే ఎక్కువ విద్యుత్తు వినియోగిస్తున్న గృహాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ అధికారులు, సోలార్ కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు.

కోర్టు ఆదేశాల మేరకు వసతులు

నగరంపాలెం: కోర్టు ఆదేశాల మేరకు బోరుగడ్డ అనిల్‌కుమార్‌కు కనీస వసతులు కల్పించామని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలోని సమావేశ మందిరంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. అనిల్‌ను అరెస్టు చేశాక వైద్య పరీక్షల కోసం జీజీహెచ్‌కు తరలించారని చెప్పారు. గ్యాస్, శ్వాసకోశ సమస్యలు, వరిబీజంతో బాధపడుతున్నట్లు అతను వైద్యుల దృష్టికి తీసుకొచ్చాడని పేర్కొన్నారు. పోలీస్ కస్టడీకి అప్పగించే సమయంలో అనారోగ్య సమస్యలపై అతను జిల్లా న్యాయస్థానం ఎదుట చెప్పగా, నిందితుడు నిద్రించేందుకు కనీస సౌకర్యాలు కల్పించాలని పోలీస్ శాఖను ఆదేశించారని వివరించారు.